సాక్షి
జగిత్యాల
ఆదివారం । 4 । జూన్ । 2023

న్యూస్‌రీల్

కేసులతో సాధించేదేమీలేదు



మాట్లాడుతున్న జడ్జి ప్రసాద్

జగిత్యాలజోన్: కక్షలు, కార్పణ్యాలతో పోలీస్‌స్టేషన్లు, కోర్టుల్లో కేసులు నమోదు చేసుకోవడం ద్వారా ఒరిగేదేమీలేదని, లేదని, ప్రశాంత వాతావరణంలో సమస్యలు పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సబ్ జడ్జి కంచ ప్రసాద్ సూచించారు. జగిత్యాల కోర్టులో జూన్ 10న నిర్వహించే మెగా లోక్ అదాలత్‌పై జిల్లా పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ, పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాజీచేసుకోదగ్గ కేసులను గుర్తించి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు జడ్జి నారాయణ, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

'రైతు సంక్షేమాన్ని విస్మరించారు'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్(జగిత్యాల): రైతుల సంక్షేమాన్ని విస్మరించి ప్రభుత్వం సంబురాలు నిర్వహిస్తోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటకు గిట్టుబాటు ధర లేదని, అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారని అన్నారు. అయినా, సర్కార్ పట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, యూత్ ప్రధాన కార్యదర్శి కొయ్యేడి మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

వెల్గటూర్(ధర్మపురి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామంలో శనివారం ఆచార్య జయశంకర్ బడిబాట నిర్వహించారు. మన ఊరు.. మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చామని డీఈవో తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధనతో మానసిక ఒత్తిడిలేని మంచి విద్య అందుతోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో భూమయ్య, సర్పంచ్ కొమ్ము రాంబాబు, ప్రధానోపాధ్యాయురాలు సూర్యకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు సురక్ష దినోత్సవం

జగిత్యాలక్రైం: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సురక్ష దినోత్సవం నిర్వహిస్తామని ఎస్పీ భాస్కర్ శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు కొత్తబస్టాండ్ నుంచి పెట్రో కార్, బ్లూకోల్ట్స్ వాహనాలతో ర్యాలీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. సాయంత్రం 5 గంటలకు సుమంగళి గార్డెన్స్‌లో పోలీసు శాఖ అవలంబిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, సైబర్‌క్రైం, షీటీం, ఫింగర్‌ప్రింట్, కమ్యునికేషన్, బాంబ్ డిస్పోజల్ టీం, ఆయుధాల గ్యాలరీ, డాగ్‌స్క్వాడ్‌పై స్టాల్స్ ఏర్పాటు చేస్తామని ఎస్పీ వివరించారు.

ఐక్యంగా పోరాడితేనే న్యాయం

జగిత్యాలటౌన్: ఐక్యంగా పోరాడితేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది, ఇందుకోసం వచ్చే ఎన్నికలే లక్ష్యంగా ముందుకు సాగాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్య అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనైక్యతతోనే అన్నిరంగాల్లో వెనుకబాటుకు గురవుతున్నామని ఆయన తెలిపారు. జగిత్యాల నియోజకవర్గంలో 24వేల మంది ముదిరాజ్‌లు ఉన్నా అభివృద్ధి ఫలాలు అందడంలేదని పేర్కొన్నారు. హక్కుల సాధనకు ఉద్యమాలే శరణ్యమని పేర్కొన్నారు.

దుబాయిలోని ఆఫీస్‌లో రాధారపు సత్యం



వాళ్లంతా సామాన్యులు. మధ్యతరగతి కష్టాలను అనుభవించిన వారు. ఆ కష్టాల కడలిని దాటేందుకు ఉపాధి కోసం గల్ఫ్‌బాట పట్టారు. కూలీగా మొదలైన వారి ప్రస్థానంలో ఎన్నో ఒడిదొడుకులు ఉన్నాయి. గది అద్దె చెల్లించలేక ఒకరు డేరాలో నిద్రపోతే.. డబ్బులు సరిపోక ఇంకొకరు కార్లు కడిగారు.. కడుపు మాడ్చుకున్న రోజులూ ఉన్నాయి. అన్నింటిని అధిగమించిన వారిలో అంకితభావం.. ఎదగాలన్న కసి ఉన్నత స్థానాల్లో నిలబెట్టింది. కొందరు కంపెనీలు పెట్టి యజమానులుగా మారితే.. మరికొందరు అదే కంపెనీలో ఉన్నత స్థానాలకు చేరారు. వారి ఎదుగుదలలో ఇతరులకు ఉపాధి చూపిస్తున్నారు. వందలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తూ.. ఉపాధి చూపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న సామాన్యుల సక్సెస్ స్టోరీ ఈవారం సండే స్పెషల్..

అసామాన్యులు

- కష్టాల కడలిని దాటిన యువకులు
- ఉపాధి కోసం గల్ఫ్‌బాట
- అంకితభావంతో ఉన్నత స్థానాలకు..
- ఇతరులకు ఉపాధి చూపుతున్న వైనం
- ఆదర్శంగా నిలుస్తున్న ఎన్‌ఆర్‌ఐలు

చదువులో ఫెయిల్.. జీవితంలో పాస్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): చదువు అచ్చిరాలేదు.. ఆర్థిక పరిస్థితి కలిసి రాలేదు. పదోతరగతి వరకే చదవడమే గగనంగా సాగింది. కష్టాల కడలిని దాటేందుకు చిన్నతనంలోనే స్వగ్రామాన్ని వదిలి ఉపాధి వెతుక్కుంటూ గల్ఫ్‌బాట పట్టాడు. తొలి రోజుల్లో కూలీగా పనిచేసిన రాధారపు సత్యం అంచెలంచెలుగా ఎదిగి నేడు ఒక కంపెనీ యజమానిగా 780 మందికి ఉపాధి కల్పిస్తున్నాడు.

2002లో కూలీగా వెళ్లి..

ఉమ్మడి ఎల్లారెడ్డిపేట మండలంలోని అడవిపదిరకు చెందిన రాధారపు సత్యం పదోతరగతిలో ఒక్క మార్కుతో ఫెయిలై ఉపాధి కోసం 2002లో దుబాయికి వెళ్లాడు. అక్కడ తొలి ఏడాది సెంట్రింగ్ కూలీగా పనిలో చేరాడు. డేరాల మధ్య నివాసం ఉంటూ కష్టంగా కాలం వెళ్లదీశాడు. ఏడాది అనంతరం ఓ కంపెనీలో ఆఫీస్ బాయ్‌గా చేరాడు. అదే కంపెనీలో మార్కెటింగ్ సేల్స్‌మెన్‌గా, ఆపరేషన్ మేనేజర్‌గా పనిచేశాడు. ఆర్థిక పరిస్థితుల్లో మార్పు రాకపోవడం.. విధుల్లో బాధ్యతలు పెరగడంతో సత్యం ఆలోచనల్లో పడ్డాడు. ఉద్యోగ బాధ్యతలతో అలసిపోయిన ఆయనకు ఓ వినూత్న ఆలోచన వచ్చి.. తానే సొంతంగా కంపెనీ పెట్టి పది మందికి ఉపాధి కల్పించాలనే నిర్ణయానికి వచ్చాడు. 2015లో సొంతంగా ఎల్ఎస్‌పీఎంకే అనే పేరుతో కంపెనీని ప్రారంభించాడు. ఇక్కడ ఉపాధి లేక బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి వీసాలను పంపించి తన కంపెనీలో ఉపాధి కల్పించాడు. ప్రస్తుతం సత్యం కంపెనీలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు చెందిన 780 మంది ఉపాధి పొందుతున్నారు. అంతేకాకుండా తెలంగాణ దుబాయి ఎమిరేట్స్(ఈటీసీఏ) అధ్యక్షుడిగా ఏడాదిగా పనిచేస్తున్నాడు.

కష్టపడితే ఫలితం ఉంటుంది

జీవితంలో కుంగిపోకుండా ఒక లక్ష్యంతో కష్టపడితే ఉన్నత స్థానాలకు చేరుకుంటారు. ఇందుకు నేనే ఉదాహరణ. చిన్నతనంలో ఆర్థిక ఇబ్బందులతో బతకడం కష్టమని భావించి.. ఉపాధిని వెతుక్కుంటూ ఎడారి దేశానికి వెళ్లి అక్కడ కూడా దుర్భర జీవితాన్ని గడిపి ఈ స్థాయికి చేరాను. ప్రతి ఒక్కరు కష్టమే ఫలితంగా భావించి ముందుకు సాగాలి.

– రాధారపు సత్యం, ఈటీసీఏ అధ్యక్షుడు



దుబాయిలోని ఆఫీసులో గోపాల్‌రావు

నాడు కూలీ.. నేడు యజమాని

కోనరావుపేట(వేములవాడ): ఉపాధి కోసం దుబాయికి వెళ్లిన వ్యక్తి ఏకంగా ఓ కంపెనీకి యజమాని స్థాయికి ఎదిగాడు. తాను ఎదగడంతోపాటు మరో 130 మందికి ఉపాధి కల్పిస్తున్నాడు. కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నాడు కోనరావుపేట మండలంలోని నాగారం గ్రామానికి చెందిన బొమ్మెన గోపాల్‌రావు.

2016లో దుబాయి బాట

బొమ్మెన గోపాల్‌రావు గతంలో గ్రామ ఎంపీటీసీగా పనిచేశారు. తర్వాత 2016లో దుబాయిలోని ఓ కంపెనీలో పనిచేసేందుకు వెళ్లాడు. రెండేళ్లు కంపెనీలో పనిచేసిన గోపాల్‌రావు అక్కడి పరిస్థితులను అవగతం చేసుకుని 2018లో క్రియేటివ్ వ్యూ టెక్నికల్ వర్క్స్(ఎల్‌ఎల్‌సీ) అనే కంపెనీని ప్రారంభించాడు. అక్కడి పనులకు, వివిధ కంపెనీలకు కూలీలను చేరవేస్తుంటాడు. అలా ఇప్పటి వరకు ఇండియాలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 130 మంది యువకులను దుబాయికి తీసుకెళ్లి ఉపాధి చూపుతున్నాడు.



దుబాయి షేక్‌తో వేములవాడకు చెందిన తోట రామ్‌కుమార్

కష్టపడి.. పైకొచ్చారు

వేములవాడ: మూడు దశాబ్దాల క్రితం గల్ఫ్‌బాట పట్టిన యువకుడు.. నేడు ఓ వ్యాపార సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఉపాధి వెతుక్కుంటూ వెళ్లిన వేములవాడకు చెందిన తోట రామ్‌కుమార్ నేడు వందలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. 1989లో దుబాయికి ఉపాధి కోసం వెళ్లాడు వేములవాడకు చెందిన తోట రామ్‌కుమార్. తొలి రోజుల్లో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ఎస్సారార్(శ్రీరాజరాజేశ్వర) పేరుతో బిల్డింగ్ మెటీరియల్ సరఫరా చేసే వ్యాపారం చేస్తున్నారు. దాదాపు 250 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

సొంతూరికి సేవ

ఉపాధి వెతుక్కుంటూ దుబాయి వెళ్లిన తోట రామ్ కుమార్ 30 ఏళ్లుగా అక్కడే ఉంటున్నారు. భార్య స్వప్న, కుమారులు రాహుల్, రోహన్, కూతురు రోష్నిలతో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. పండుగలు, ప్రత్యేక కార్యక్రమాల సమయంలో వేములవాడకు వస్తుంటారు.

బాధితులకు అండగా..

దుబాయిలో ఇబ్బందులు పడుతున్న మన ప్రాంతం వారికి అండగా నిలుస్తున్నారు. తనకు ఉన్న పరిచయాలతో వారి సమస్యలు పరిష్కరిస్తున్నారు. గల్ఫ్ బాధితులకు అండగా నిలుస్తున్నారు.

లేబర్ టు మేనేజర్‌గా..

- అంచెలంచెలుగా ఎదిగిన నారాయణపూర్ వాసి
- మస్కట్‌లో పలువురికి ఉపాధి కల్పిస్తున్న యువకుడు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రైతుకుటుంబంలో పుట్టిన ఓ సామాన్య యువకుడు ఉపాధిని వెతుక్కుంటూ గల్ఫ్ దేశాలకు వెళ్లి.. నేడు మేనేజర్ స్థాయికి చేరాడు. ఎంతో మందికి ఉపాధి కల్పిస్తూ ఆ కుటుంబాలకు బాసటగా నిలుస్తున్నాడు. కుగ్రామంలో పుట్టిన ఆ యువకుడు డిగ్రీ వరకు చదివి.. 2006లో స్వగ్రామంలో ఉపాధి అవకాశాలు లేక గల్ఫ్‌బాట పట్టాడు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన కొండేటి దేవేందర్ ఒమన్ దేశంలో తొలుత పార్ట్‌టైం ఉద్యోగంలో చేరాడు. వేతనం తక్కువగా ఉండడంతో కార్లు సైతం కడుగుతూ కాలం వెల్లదీశాడు. మురియా టూరిజం డెవలప్‌మెంట్ కంపెనీలో ఆఫీస్‌బాయ్‌గా చేరాడు. దేవేందర్ అంకితభావంతో పనిచేస్తున్న విధానాన్ని గుర్తించిన యాజమాన్యం అడ్మిన్ అసిస్టెంట్‌గా అవకాశం ఇచ్చింది. క్రమంగా రెంటల్ మేనేజర్ స్థాయికి ఎదిగాడు. తన ఎదుగుదలతోపాటు సిరిసిల్ల జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన అనేక మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాడు. అక్కడికి వెళ్లిన వారికి మంచి ఉద్యోగాలను దగ్గర ఉండి వెతికి పెట్టాడు. దేవేందర్ సహకారంతో సుమారు యాభైకి పైగా ఒమన్ దేశంలో ఉద్యోగాలు చేస్తున్నారు. వారంతా ఇండియాలో సాఫ్ట్‌వేర్ల కంటే ఎక్కువ వేతనాలు పొందుతూ సంతోషంగా ఉన్నారు.



ఆఫీసులో దేవేందర్

అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి

ఉద్యోగాలు లేవని.. నిరాశ పడకుండా మంచి నైపుణ్యంతో ఒమన్ లాంటి దేశాలకు వస్తే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. నైపుణ్యం ఉన్న వారికి గౌరవప్రదమైన ఉద్యోగమే కాకుండా మంచి వేతనాలు ఉంటాయి. గల్ఫ్ దేశాల్లో ఎక్కువగా టూరిజం, హోటల్ రంగాల్లో ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఆత్మస్థైర్యంతో ఉండి, ఈ దేశానికి వస్తే ఏదైనా సాధించే అవకాశం ఉంది.

– కొండేటి దేవేందర్, ఎన్‌ఆర్‌ఐ, ఒమన్

వ్యవసాయం పండుగైంది



జగిత్యాలరూరల్: ఎడ్లబండిపై దావ వసంత







ఎండ్లబండిపై కొప్పుల, ఎమ్మెల్యేలు సంజయ్, విద్యాసాగర్‌రావు, అదనపు కలెక్టర్ మకరంద్

- మంత్రి కొప్పుల ఈశ్వర్
- పొలాసలో రైతు దినోత్సవం

జగిత్యాలఅగ్రికల్చర్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు వ్యవసాయం దండుగ అని అన్నారని, ఇప్పుడు వ్యవసాయం పండుగలా మారిందని రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో శనివారం రైతు దినోత్సవం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ, తినడానికి సరిపడా పంట పండితే చాలనుకున్న తెలంగాణ.. ఇప్పుడు దేశానికి అన్నం పెట్టే స్థాయికి ఎదిగిందన్నారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్లకు జిల్లావ్యాప్తంగా 420కుపైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేనివిధంగా వానాకాలం, యాసంగిలో ఎకరాకు రూ.5వేల పెట్టుబడి సాయం అందిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, రైతు పథకాలతోను రైతును అని గర్వంగా చెప్పుకునే పరిస్థితి ఉందన్నారు. పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం శాస్త్రవేత్తలు రూపొందించిన విత్తనాలను అతిథులు పరిశీలించారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ రాజు, ఆదర్శరైతు రాంరెడ్డి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

కేసీఆరే మళ్లీ సీఎం

జగిత్యాలరూరల్: కేసీఆరే మళ్లీ సీఎంగా కావాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత ఆకాంక్షించారు. అంబారిపేట రైతువేదిక వద్ద రైతులతో కలిసి ఎడ్లబండి, ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఆర్డీవో మాధురి, మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్, జెడ్పీటీసీ మహేశ్, ఎంపీపీ లక్ష్మి, సర్పంచ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, చల్‌గల్, పొరండ్ల, లక్ష్మీపూర్, కల్లెడ, పొలాస గ్రామాల్లో వ్యవసాయాధికారులు, ప్రజాప్రతినిధులు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట

కోరుట్లరూరల్: రైతు సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. సంగెం, మోహన్‌రావుపేట, అయిలాపూర్, పైడిమడుగు రైతువేదికల్లో నిర్వహించిన తెలంగాణ దశాబ్ది వేడుకల్లో అదనపు కలెక్టర్ మకరంద్, ఆర్డీవో వినోద్‌కుమార్, డీఎస్పీ రవీందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ పంచెకట్టుతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, ఎంపీపీ తోట నారాయణ, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, పశువైద్య కళాశాల డీన్ మాధవరావు, ఎంపీడీవో నీరజ తదితరులు పాల్గొన్నారు.

రైతుబాంధవుడు సీఎం కేసీఆర్

రాయికల్(జగిత్యాల): రైతుబాంధవుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. భూపతిపూర్ రైతువేదిక వద్ద శనివారం తెలంగాణ దశాబ్ది వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా చేపట్టిన రైతు దినోత్సవంలో ఎమ్మెల్యే స్వయంగా ఎడ్లబండి నడిపారు. అనంతరం మాట్లాడారు. ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్లు ఏనుగు మల్లారెడ్డి, ముత్యంరెడ్డి, రాజిరెడ్డి, రైతుబంధు సమితి నాయకులు మోహన్‌రావు, రాజన్న, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఏవో ముక్తేశ్వర్, హార్టికల్చర్ ఆఫీసర్ స్పందన, చెర్లకొండాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ రాజ్యలక్ష్మి, ఉపసర్పంచ్ సాయిరెడ్డి, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్ల పాలనలో వందేళ్ల అభివృద్ధి

ధర్మపురి: బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలోనే వందేళ్లలో జరిగే అభివృద్ధి చేసిచూపించిందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. నర్సయ్యపల్లె స్టేజీ రైతువేదిక ఆవరణలో జరిగిన రైతు దినోత్సవంలో ఆయన మాట్లాడారు. రోళ్లవాగు నిర్మించి వందేళ్లు కావస్తోందని, కాంగ్రెస్ పాలనలో రెండుసార్లు మంత్రిగా పనిచేసి ఏం వెలగబెట్టారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ప్రశ్నించారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, జిల్లా అధికారి లక్ష్మీనారాయణ, ఏడీ రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఇక ఇన్‌చార్జి పాలనే దిక్కు

- జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక ఇప్పట్లో లేనట్లే..



జగిత్యాల: అధికార బీఆర్‌ఎస్‌కు చెందిన జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణి గత జనవరి 25న తన పదవికి రాజీనామా చేసిన విషయం విదితమే. దీంతో వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్‌ను ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించారు. ఆరునెలల్లో చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాల్సి ఉండగా.. గత మే 6న నోటిఫికేషన్ జారీచేసిన ఎన్నికల కమిషన్.. అదేనెల 15 లేదా 19వ తేదీన ఎన్నికలు నిర్వహించాలని సూచించింది.

ఎన్నిక నిర్వహించలేమన్న అధికారులు..

బల్దియాలోని 37వ వార్డుకు ప్రాతినిధ్యం వహించిన భోగ శ్రావణి ఆ తర్వాత తన కౌన్సిలర్ పదవికి కూడా గత మార్చి 13న రాజీనామా చేశారు. దీంతో ఆ స్థానం ఖాళీ అయింది. కౌన్సిలర్ స్థానానికి ఎన్నికలు నిర్వహించకుండా చైర్‌పర్సన్ స్థానానికి ఎన్నికలు నిర్వహించలేమంటూ మున్సిపల్ అధికారులు ఇటీవల ఎన్నికల కమిషన్‌కు ఓ లేఖ రాశారు. ఆగ్రహించిన ఎన్నికల కమిషన్.. కౌన్సిలర్ స్థానానికి చేసిన రాజీనామా గురించి తమ వద్ద ఎందుకు ప్రస్తావించలేదంటూ బల్దియా కమిషనర్‌కు సంజాయిషీ నోటీసు జారీచేసింది. అయితే, శ్రావణి కౌన్సిలర్ పదవికి చేసిన రాజీనామాను తాము ఆమోదించామని, ఆ లేఖను ఎన్నికల కమిషన్‌కు పంపించామని, సాంకేతిక కారణాలతో అది అందకపోవచ్చని మున్సిపల్ కమిషన్ సమాధానం ఇచ్చారు.

కావాలనే చేశారా..

37వ వార్డు కౌన్సిలర్ స్థానానికి ఎన్నికలు నిర్వహించకుండా బల్దియా చైర్‌పర్సన్ ఎన్నికలు నిర్వహించే వీలు లేకపోవడంతో ఈ కారణాన్ని సాకుగా చూపుతూ కొందరు అధికారులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని చర్చ సాగుతోంది. మరికొద్ది నెలల్లోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనుండడం, రాజకీయ నాయకుల ఒత్తిళ్లు అధికం కావడంతో అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. దీంతో ఇకముందు కూడా ఇన్‌చార్జి మున్సిపల్ చైర్‌పర్సన్‌తోనే పాలన నెట్టుకు వస్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ నరేశ్‌ను సంప్రదిస్తే.. భోగ శ్రావణి రాజీనామా ద్వారా ఖాళీ అయిన 37వ కౌన్సిలర్ స్థానానికి ఎన్నికలు నిర్వహించాక చైర్‌పర్సన్ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

ఉద్యమ చరిత్రపై విద్యార్థులకు అవగాహన

జగిత్యాలఅగ్రికల్చర్: పొలాస వ్యవసాయ కళాశాలలో శనివారం తెలంగాణ ఉద్యమ చరిత్ర, అభివృద్ధిపై వ్యవసాయ విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.సత్యప్రకాశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ పరిస్థితులు, ప్రజల జీవనవిధానంపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ భారతీభట్, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ దేశానికే దిక్సూచి

మల్యాల(చొప్పదండి): తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే దిక్సూచిగా నిలిచాయని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా స్థానిక రైతువేదిక ఆవరణలో శనివారం రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, స్వరాష్ట్రంలో పెరిగిన సాగు విస్తీర్ణం, దిగుబడులు వ్యవసాయ రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతకు అద్దం పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మిట్టపల్లి విమల, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ సుభాన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆసం శివకుమార్, సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కట్నం కోసం వేధించిన ముగ్గురిపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్‌నకు చెందిన బిష్ట దుర్గభవానిని అదనపు కట్నం కోసం వేధించిన భర్త బిష్ట నయాల్‌సింగ్, మామ బిష్ట లాల్‌బహదూర్, అత్త బిష్ట రాధపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాంచందర్‌రావు తెలిపారు. మరో రూ.2 లక్షలు అదనపు కట్నం తేవాలంటూ దుర్గభవానిని కొద్దిరోజులుగా భర్త, మామ, అత్త మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మరో ఘటనలో ఒకరిపై ..

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పురాణిపేటకు చెందిన గొల్లపల్లి రోజాను అదనపు కట్నం కోసం వేధించిన భర్త కార్తీక్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాంచందర్‌రావు తెలిపారు. రోజాతో కార్తీక్‌కు ఆరేళ్ల క్రితం వివాహమైంది. ఆ సమయంలో రూ.2 లక్షలు కట్నం ఇచ్చారు. వీరికి సంతానం కలగకపోవడంతో కొద్దిరోజులుగా కార్తీక్ అదనంగా మరో రూ.2 లక్షల కట్నం కావాలని మానసికంగా, శారీరకంగా రోజాను వేదిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దాడిచేసిన వ్యక్తిపై..

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో అక్కపై దాడిచేసిన తమ్ముడు జంగ తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాంచందర్‌రావు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం మేడిపల్లికి చెందిన మసూక్రి గంగరాజు జగిత్యాలలోని గాంధీనగర్‌లో తన తల్లి జంగ రాజవ్వ అనారోగ్యానికి గురికాగా ఆమెను చూసేందుకు గతనెల 30న వచ్చింది. దీంతో ఆమె సోదరుడు తిరుపతి ఎందుకు వచ్చావని తన తల్లిని ఎందుకు పోషిస్తున్నావంటూ గంగరాజుపై దాడిచేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్న పట్టణ సీఐ తెలిపారు.

రాయితో కొట్టినందుకు..

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని అర్పపల్లి గ్రామంలో ధాన్యం బస్తాలు తీసుకెళ్లేందుకు వచ్చిన లారీ డ్రైవర్‌ను రాయితో కొట్టిన వ్యక్తిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్సై మనోహర్‌రావు కథనం.. ఐకేపీ కేంద్రంలోకి లారీ వెళ్లడానికి సరిగా దారి లేకపోవడంతో డ్రైవర్ షేక్ చాంద్‌పాష కేంద్రానికి కొద్ది దూరంలో లోడింగ్ చేయడానికి లారీ నిలుపుకున్నాడు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన కుడుకల మల్లేశం రాయితో కొట్టడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు మల్లేశంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం తుంగూర్, కండ్లపల్లి గ్రామాల మధ్య శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ధర్మపురి మండలం దొంతాపూర్‌కు చెందిన శివతో పాటు మరో వ్యక్తి ద్విచక్రవాహనంపై కండ్లపల్లి వెళ్తుండగా అదుపుతప్పి కింద పడిపోవడంతో ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు జగిత్యాల ఆస్పత్రికి తరలించారు.

సాగుపై కొరవడిన అవగాహన

- సదస్సుల నిర్వహణపై నిర్లక్ష్యం
- పంటల సాగుకు అందని సలహాలు, సూచనలు
- పట్టించుకోని అధికారులు



మల్లాపూర్ మండలంలో వ్యవసాయ పనుల్లో రైతులు(ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): వానాకాలం సాగుకు రైతులు సిద్ధమవుతున్నా.. విత్తనాల ఎంపిక, భూసార పరీక్షలు, ఏ పంటలు వేయాలి అనే వాటిపై అవగాహన కల్పించేందుకు సంబంధిత అధికారులు నేటికీ చర్యలు చేపట్టడం లేదు. పంటల సాగులో సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఏటా నిర్వహించే రైతు చైతన్యయాత్రలు జాడ లేకుండా పోగా, మన తెలంగాణ–మన వ్యవసాయం అటకెక్కింది. అలాగే వ్యవసాయ రంగంలో సమగ్ర అభివృద్ధి సాధించడం, రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించి వారిని చైతన్యవంతులను చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మ (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) పథకం నిర్వీర్యం అవుతోందని రైతులు వాపోతున్నారు.

'ఆత్మ' ద్వారా ఇలా..

ఆత్మ కార్యక్రమాన్ని 2014లో ప్రవేశపెట్టగా, అందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. జిల్లా కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా డీఏవో కన్వీనర్‌గా ఉంటారు. గతంలో డివిజన్ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశారు. అధికారులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి సాంకేతికతపై అవగాహన కల్పించాలి. పశు సంవర్ధక, ఉద్యానవన, మత్స్యశాఖల్లో సాంకేతికంగా వచ్చే మార్పులను అధికారులు వివరించాల్సి ఉంటుంది. దీనికి ప్రభుత్వం ఏటా రూ.లక్షల నిధులు విడుదల చేస్తుంది. ఆత్మ ఆధ్వర్యంలో రైతులను చైతన్యవంతం చేసేందుకు సదస్సులు, ప్రదర్శనలు ఏర్పాటు చేయాలి. కానీ అవి ఎక్కడా కనిపించడం లేదు. కాలానుగుణంగా వ్యవసాయంలో వస్తున్న మార్పులు, ఆధునిక పద్ధతుల గురించి అవగాహన కల్పిస్తారు. యంత్రాలు కొనుగోలు చేసినా వాటిపై అవగాహన కల్పించే నాథుడే కరువయ్యాడు. ఇవన్నీ ఆత్మ ఆధ్వర్యంలో చేపట్టాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

నీరుగారుతున్న లక్ష్యం

రైతుల ప్రయోజనం కోసం చేపట్టాల్సిన మన తెలంగాణ–మన వ్యవసాయం, ఆత్మ వంటి అవగాహన సదస్సులను అధికారులు విస్మరించారు. ప్రస్తుతం వానాకాలం సీజన్‌కు సనద్ధమవుతున్న నేపథ్యంలో ఎలాంటి పంటలు వేసుకోవాలో చెప్పే వారు కరువయ్యారు. దీంతో పాటు పాడిపరిశ్రమపై కూడా దృష్టి పెట్టి పశువుల అభివృద్ధి, పశుసంవర్ధకశాఖ అందిస్తున్న రాయితీల గురించి రైతులకు వివరించాల్సిన అవసరం ఉంది. విత్తనోత్పత్తికి సంబంధించి రైతులను ప్రోత్సహించాలి. సాగులో విద్యుత్ వినియోగంపై రైతులకు అవగాహన అవసరమే. వ్యవసాయ, ఇతర శాఖల అధికారులు సంయుక్తంగా రైతుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించాలి. కాగా సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో మన తెలంగాణ–మన వ్యవసాయం, ఆత్మ వంటి పథకాలు ఉన్నాయనే విషయం రైతులకు తెలియకుండా పోతుంది. ఆత్మ కార్యక్రమం కోసం ప్రభుత్వం నుంచి వచ్చే రూ.లక్షల నిధులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవగాహన సదస్సులు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

సదస్సులు నిర్వహించాలి



పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలి. దీంతో సాగులో మెలకువలతో పాటు ఆధునాతన పద్ధతులు తెలుసుకునే అవకాశం ఉంటుంది. యంత్రాల వినియోగంపై అవగాహన కలుగుతుంది.

– క్యాతం మల్లారెడ్డి, రైతు, మల్లాపూర్

ఇతర పథకాలపైనే దృష్టి



అధికారులు మన తెలంగాణ–మన వ్యవసాయం, ఆత్మ పథకంపై అవగాహన సదస్సులు నిర్వహించడం లేదు. దీంతో రైతులకు పంటల సాగుకు సంబంధించి వివరాలు తెలిపేవారే కరువయ్యారు. వ్యవసాయ అధికారులు రైతుబంధు, ఇతర పథకాల అమలు చేయడంపైనే దృష్టి సారించారు.

– గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ, రేగుంట

అవగాహన కల్పిస్తున్నాం



ఆత్మలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. అయినా వ్యవసాయ శాఖ సిబ్బందితో జిల్లాలోని అన్ని మండలాల్లో ఆత్మ సదస్సులు నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతువేదికలతో పాటు గ్రామ పంచాయతీల్లో సదస్సులు నిర్వహించి పంటల సాగుపై సలహాలు, సూచనలు అందిస్తున్నాం.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

సర్దార్ సత్రం స్థలాన్ని కాపాడాలి

- కలెక్టర్‌కు కౌన్సిలర్ లేఖ

జగిత్యాల: పట్టణ నడిబొడ్డున ఉన్న 30 గుంటల సర్దార్ సత్రం స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని 35వ వార్డు కౌన్సిలర్ జయశ్రీ శనివారం కలెక్టర్‌కు లేఖ రాశారు. ఈసత్రం స్థలాన్ని 1948 నుంచి 1952 వరకు అన్నివర్గాల వారు చందాలతో కొనుగోలు చేశారని లేఖలో పేర్కొన్నారు. ఇందులో అన్ని వర్గాల వారు సమావేశాలు, శుభకార్యాలు నిర్వహించుకునే వారని, దీనికి అనువంశిక ధర్మకర్తలు ఎవరూ లేరని, దేవాదాయ శాఖ ఉత్తర్వుల ప్రకారం వారసత్వేర ట్రస్ట్‌బోర్డు నియమించగా, కాలపరిమితి 24.01.1992న ముగిసిందన్నారు. రెవెన్యూ రికార్డులు, పహాణీలు, మున్సిపల్ రికార్డుల్లో సర్దార్ సత్రమనే ఉందన్నారు. అసెస్మెంట్ రికార్డుల్లో 2010కి ముందు ఉన్న పేరును ఎలాంటి ఆధారం లేకుండానే ఆర్యవైశ్య భవనంగా ప్రొసీడింగ్ నంబరు 1/452/2010 మేరకు 26.10.2010న అప్పటి మున్సిపల్ అధికారులు పేరు మార్పిడి చేశారని, దీనిపై అభ్యంతరాలు రాగా 09.12.2016న మళ్లీ సర్దార్ సత్రంగా పేరు మార్పిడి చేయడం జరిగిందన్నారు. ఇటీవల మళ్లీ ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆ స్థలంలో నూతన భవన నిర్మాణానికి దరఖాస్తు చేసుకోగా అప్పటి కమిషనర్ గంగాధర్ పరిశీలించి సర్దార్ సత్రం పేరిట ఉందని తిరస్కరించారని వివరించారు. సత్రం స్థలం అన్ని వర్గాలకు చెందిందని, ఒక వర్గం వారు దానిని కబ్జా చేయాలని చూస్తున్నారని, పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

రైతులు ఏడుస్తుంటే సంబరాలా?



జెడ్పీటీసీతో రైతుల వాగ్వాదం

- రైతు దినోత్సవ వేడుకలో అన్నదాతల నిరసన

వెల్గటూర్(ధర్మపురి): మండల కేంద్రంలో నిర్వహించిన రైతు దినోత్సవ కార్యక్రమం రసాభాసగా మారింది. అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచి మొలకలు వచ్చి ఓవైపు రైతులు ఏడుస్తుంటే ప్రభుత్వం రైతు దినోత్సవం పేరిట సంబరాలు నిర్వహించడం విడ్డూరంగా ఉందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో జెడ్పీటీసీ బి.సుధారాణి ఆధ్వర్యంలో రైతు దినోత్సవ సంబరాలు నిర్వహించారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ ముందు చూపుతో రైతుల జీవితాల్లో వెలుగులు నిండాయని అన్నారు. అంతలోనే పాశిగామ సర్పంచ్ బొప్పు తిరుపతి మాట్లాడుతూ, రెండు నెలలు దాటినా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగడంలేదని, క్వింటాలుకు 8 కిలోల చొప్పున మిల్లర్లు దోచుకుంటున్నారని రైతులు ఏడుస్తుంటే ప్రభుత్వం రైతు దినోత్సవం పేరిట సంబరాలు చేయడం సమంజసం కాదన్నారు. వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలని జెడ్పీటీసీతో రైతులు వాగ్వాదానికి దిగారు. రైతుల నిరసనతో పరిస్థితి అదుపుతప్పే అవకాశం ఉందని సమావేశాన్ని త్వరగా ముగించారు. కాగా ఉపాధి పనికి వెళ్లిన మహిళలను పని ముగిసిన అనంతరం వేడుకల్లో పాల్గొనేందుకు ట్రాక్టర్లలో రైతువేదిక వద్దకు తరలించారు. కాగా ఎండలో పనిచేసిన తమను ఇలా సమావేశాలకు తీసుకువచ్చి కనీసం నీళ్లు కూడా ఇవ్వలేదని కూలీలు సమావేశం మధ్యలోనే బయటకు వెళ్లడంతో వారికి సర్దిచెప్పి మళ్లీ లోపలికి తీసుకువచ్చారు.

రెండు కార్లు ఢీ.. ట్రాఫిక్‌కు అంతరాయం



సంఘటన స్థలంలో నిలిచిపోయిన ట్రాఫిక్

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి వద్ద జగిత్యాల–నిజామాబాద్ ప్రధాన రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి కారు అదుపుతప్పి మరో కారును ఢీకొట్టింది. రెండు కార్లు ఒకదానికొకటి ఢీకొనడంతో నుజ్జునుజ్జయ్యాయి. కార్లలో ఉన్నవారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. నడిరోడ్డుపై రెండు కార్లు ఢీకొనడంతో సుమారు గంటన్నరపాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ ఎస్సై రాము సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో రోడ్డుపై కార్లను తొలగించారు. ఇద్దరు డ్రైవర్లకు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు.

రైతు సంఘం నాయకుల అరెస్ట్



ఠాణాలో రైతు సంఘం నాయకులు

రాయికల్(జగిత్యాల): మండలంలోని ఇటిక్యాల గ్రామంలో రైతు సంఘం నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం నిర్వహించే రైతు దినోత్సవాన్ని అడ్డుకుంటామని నాయకులు ప్రకటించగా ఎస్సై అశోక్ ముందస్తుగా ఏలేటి జలేందర్‌రెడ్డి, కొమ్ముల ఆదిరెడ్డి, మారంపల్లి గంగాధర్, బయ్యని ఆంజనేయులును అరెస్ట్ చేసి ఠాణాకు తరలించారు.

పెగడపల్లిలో..



పెగడపల్లి ఠాణాలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని కాంగ్రెస్, బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన రైతు దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వానికి వ్యతిరకంగా నల్ల బ్యాడ్జీలు ధరించి రైతు వేదికల వద్దకు వెళ్తున్న క్రమంలో ఎస్సై కుమారస్వామి ఆధ్వర్యంలో పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో రైతు ఐక్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, కాంగ్రెస్, బీజేపీ మండల అధ్యక్షులు రాములుగౌడ్, కొమురెల్లి, నంచర్ల సర్పంచ్ మహేందర్‌రెడ్డి, నాయకులు మల్లేశం, విష్ణు, మల్లారెడ్డి, రాజు, అంజయ్య ఉన్నారు.

ఉల్లిగడ్డల వ్యాపారి పరార్

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని టవర్‌సర్కిల్ ప్రాంతంలో ఉల్లిగడ్డల వ్యాపా రం చేస్తున్న ఓ వ్యాపారి పరారైనట్లు తెలిసింది. కొద్దిరోజులుగా దుకాణం మూసివేసి ఉండటంతో అప్పులు ఇచ్చిన వారు ఆందోళన చెందుతున్నారు. దాదాపు రూ.50 లక్షల వరకు అప్పులు చేసి ఉడాయించినట్లు తెలిసింది.

ఐదుగురు ఎస్సైల బదిలీ

జగిత్యాలక్రైం: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఐదుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ భాస్కర్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సారంగాపూర్ ఎస్సై మనోహర్‌రావు వీఆర్ జగిత్యాల, వీఆర్‌లో పనిచేస్తున్న తిరుపతి సారంగాపూర్, వీఆర్‌లో పనిచేస్తున్న గీత జగిత్యాల డీసీఆర్‌బీ, కథలాపూర్‌లో పనిచేస్తున్న శ్వేతను వెల్గటూర్, వెల్గటూర్‌లో పనిచేస్తున్న నరేశ్‌ను జగిత్యాల వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం



గుల్లకోట కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న లక్ష్మణ్‌కుమార్

- డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్(ధర్మపురి): ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల కొర్రీలపై కలెక్టర్‌కు, స్థానిక అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. శనివారం ఎండపల్లి మండలం గుల్లకోటలో కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. 45 రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం మాత్రం రైతుల దినోత్సవం పేరుతో సంబరాలు నిర్వహిస్తుందని, రైతులకు ఏం చేశారని సంబరాలు చేస్తున్నారని నిలదీశారు. సివిల్ సప్లై అధికారితో ఫోన్లో మాట్లాడుతూ, వెంటనే ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చూడాలన్నారు. అడ్డగోలుగా దోచుకుంటున్న మిల్లర్లను కట్టడి చేయాలని లేకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేష్, ఉప సర్పంచ్ కుమారస్వామి, సత్యం, తిరుపతి, లక్ష్మణ్, సంతోష్, శ్రీనివాస్, తిరుపతి, లింగారెడ్డి, తిరుపతిరెడ్డి, చంద్రమౌళి పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

ధర్మపురి: రైతు ఉత్సవాలకు నిరసనగా డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించారు. మండలంలోని కమలాపూర్ కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. ధర్మపురిలోని మంత్రి కార్యాలయం వద్ద కమలాపూర్‌కు చెందిన ఓ రైతు ధాన్యం పోసి నిరసన వ్యక్తం చేస్తుంటే మంత్రి సంబరాల్లో పాల్గొనడం ఏంటని ఎద్దేవా చేశారు. 40–45 రోజులు కావస్తున్నా ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయలేదని ఆరోపించారు. కాగా కేంద్రం వద్ద అడ్లూరి హమాలీగా మారి ధాన్యం బస్తాలను భుజాన వేసుకొని రైతులకు తన వంతు సాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.దినేష్, ఉపాధ్యక్షుడు వేముల రాజు, తదితరులు పాల్గొన్నారు.

హత్య ఘటనలో నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

కోరుట్ల: మండలంలోని సంగెం గ్రామంలో గురువారం రాత్రి వల్లకొండ చిన్న మల్లయ్య(53) హత్య ఘటనలో ఇద్దరు నిందితులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సీఐ ప్రవీణ్‌కుమార్ వివరాలు.. వల్లకొండ చిన్న మల్లయ్య తాగిన మైకంలో భార్య, కుమారుడు పవన్, కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఇది మనసులో పెట్టుకున్న పెద్ద కుమారుడు పవన్, అతడి స్నేహితుడు మేడిపెల్లి మండలం దేశాయిపేటకు చెందిన పొన్నం కార్తీక్‌తో కలిసి చిన్న మల్లయ్య నిద్రిస్తున్న సమయంలో రోకళ్లతో కొట్టి చంపి పారిపోయారు. మృతుడి సోదరుడు వల్లకొండ పెద్ద మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. శనివారం సంగెం శివారులో నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి ద్విచక్ర వాహనం, రెండు మొబైల్ ఫోన్లు, రెండు రోకళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈకేసులో ఏ1 గా వలకొండ పవన్, ఏ2 గా పొన్నం కార్తీక్‌ను చేర్చి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ వివరించారు. నిందితులను పట్టుకోవటంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ సతీష్‌కుమార్, సిబ్బంది సురేష్, ఎల్లయ్య, సత్తయ్య, కేశవ్, గంగాధర్, సాగర్, శ్రీనివాస్‌ను సీఐ అభినందించారు.

జపాన్ ఇన్‌స్పైర్ మనక్‌కు మనోళ్లు



శ్రీహితరెడ్డి



అభిషేక్



శ్రీజ



పూజశ్రీ



హర్షిత

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఇన్‌స్పైర్ మనక్ అవార్డు ప్రదర్శనలో భాగంగా 2017–18, 2018–19, 2019–20, 2020–21 విద్యాసంవత్సరాలకు గానూ జాతీయ ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనలో అద్వితీయ ప్రదర్శన కనబరిచిన విద్యార్థుల ప్రాజెక్టులను జపాన్‌లోని సకూరా సైన్స్ హైస్కూల్‌లో జరిగే ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల ప్రదర్శనకు ఎస్‌సీఈఆర్‌టీ ఎంపిక చేశారు. తెలంగాణ నుంచి 18 ప్రదర్శనలు ఎంపిక కాగా.. ఉమ్మడి జిల్లానుంచి ఆరు ప్రదర్శనలు ఎంపిక కావడం విశేషం. పెద్దపల్లి జిల్లా నుంచి మూడు, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల నుంచి ఒక్కో ప్రదర్శన ఎంపికై ంది. 2020–21 ఏడాదికిగానూ 9వ జాతీయ ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల ప్రదర్శన ఢిల్లీలో 2022సెప్టెంబర్‌లో జరిగింది. గత నాలుగేళ్లలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థుల ప్రదర్శనలను జపాన్ ఇన్‌స్పైర్ మానక్‌లో ప్రదర్శించనున్నారు. కాగా కె.శ్రీజ, ఎం.పూజశ్రీ, డి.హర్షిత (పెద్దపల్లి), వి.శ్రీహిత రెడ్డి (కరీంనగర్), ఎండి.జాకీఅహ్మద్ (జగిత్యాల), ఎం.అభిషేక్ (రాజన్న సిరిసిల్ల) ప్రదర్శనలకు ఎంపికయ్యారు. జపాన్‌లోని సకూరాలో నవంబర్ 5 నుంచి 11 వరకు పోటీల ప్రదర్శన జరగనుంది.

గంగాధర్‌కు అవార్డు

రాయికల్(జగిత్యాల): రాయికల్ పట్టణానికి చెందిన చెంగలి గంగాధర్ శనివారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రామ్మూర్తి, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు చేతుల మీదుగా దళితరత్న అవార్డు అందుకున్నారు. గంగాధర్ 30 ఏళ్లుగా దళిత సంఘాలకు చేసిన కృషిని గుర్తించి అవార్డు అందించినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్, పట్టణ అధ్యక్షుడు బైరి రాజేందర్, పురె శ్రీనివాస్, మ్యాకల రమేశ్, సంజీవ్ పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాయికల్(జగిత్యాల): మండలంలోని ఇటిక్యాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2005–06 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 17 ఏళ్ల క్రితం పాఠశాలలో చేసిన అల్లర్లు గుర్తుచేసుకున్నారు. విద్యాబోధన నేర్పిన గురువులను సన్మానించారు.

దోహా ఖతర్‌లో ఆవిర్భావ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న గల్ఫ్ సేవాసమితి ప్రతినిధులు

ధర్మపురి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను దోహా ఖతర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఇటీవల ఏర్పాటైన తెలంగాణ గల్ఫ్ సే వాసమితి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. సేవా సమితి అధ్యక్షుడు, జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మైదం మధూకర్ నేతృత్వంలో వేడుకలు జరిపారు. కార్యక్రమానికి ఇండియన్ ఎంబసీ తొలికార్యదర్శి, ఐసీ బీఎఫ్ కో ఆర్డినేటర్ సుమన్ పోనుకర్, అధ్యక్షుడు షానవ్వాస్ భావ, ప్రముఖ జానపద గాయకురాలు స్ఫూర్తి జితేందర్ హాజరయ్యారు. జానపద గేయాలు ప్రముఖులను ఆకట్టుకున్నాయి. అధ్యక్షుడు మైదం మధూకర్(ధర్మపురి), ఉపాధ్యక్షుడు గడ్డి రాజు, ప్రధాన కార్యదర్శులు వంశీసాయి గిరీ, గోలి శ్రీనివా స్(ధర్మపురి), సంధ్యారాణి, ప్రియాంక ఉన్నారు. ఈకార్యక్రమంలో ఐసీబీఎఫ్ ఉపాధ్యక్షుడు దీపక్‌శెట్టి, జనరల్ సెక్రటరీ మోహన్‌కుమార్, కోడూరి ప్ర సాద్ రావు, కృష్ణకుమార్, నందినీ అబ్బగొనీ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌కు పదోన్నతి



మహేశ్వర్

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా పనిచేస్తున్న మహేశ్వర్‌కు ఆర్డీవోగా పదోన్నతి వచ్చినట్లు అధికారులు శనివారం తెలిపారు. జిల్లాలో ఒక్కరే తహసీల్దార్‌కు పదోన్నతి రావడం విశేషం.